పద్దుకు వేళాయెరా..

రేపే కేంద్ర బడ్జెట్ • టాప్-10 అంచనాలివే

న్యూఢిల్లీ, జనవరి 30: మరికొద్ది గంటల్లో కేంద్ర బడ్జెట్ ఆవిష్కృతం కానున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను పార్లమెంట్‌లో శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఎప్పట్లాగే ఈసారీ సమాజంలోని ఆయా వర్గాలు, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజానీకం, సగటు ఉద్యోగులు పద్దుపై బోలెడు ఆశలు, అంచనాలు పెట్టుకున్నారు. ప్రధానంగా వ్యక్తిగత ఆదాయ పన్నుకు సంబంధించి ఊరటనివ్వాలని పెద్ద ఎత్తున కోరుతున్నారు. మరి వాటిని మోదీ సర్కారు ఏ మేరకు నెరవేరుస్తుందో చూడాలి. ఇక రాబోయే బడ్జెట్‌పైనున్న టాప్-10 అంచనాలివే..

ఐటీ శ్లాబులు-రేట్లు

కొత్త, పాత వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) విధానాల్లో శ్లాబులు, రేట్లను మార్చాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుకుంటున్నారు. అయితే ఐదేండ్ల కిందట కొత్త ఆదాయ పన్ను విధానాన్ని తీసుకొచ్చిన మోదీ సర్కారు.. అప్పట్నుంచి పాత ఆదాయ పన్ను విధానం జోలికే వెళ్లడం లేదు. కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చడానికే ప్రతీ బడ్జెట్‌లో సవరణలు చేస్తూ వస్తున్నది. దీంతో ఈసారి కొత్తదానిలో వార్షిక ఆదాయం రూ.20 లక్షలు, అంతకుమించి ఉంటేనే 30 శాతం పన్ను వేయాలన్న డిమాండ్లు భారీగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రూ.15 లక్షలు దాటితే 30 శాతం పన్ను పడుతున్నది. అలాగే రూ.12-15 లక్షల శ్లాబుపై వర్తిస్తున్న 20 శాతం పన్నును 15 శాతానికి కుదించి.. కొత్తగా రూ.10-15 లక్షల శ్లాబును తీసుకురావాలని కోరుతున్నారు.

స్టాండర్డ్ డిడక్షన్

కొత్త ఆదాయ పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్‌ను లక్ష రూపాయలకు పెంచాలని పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. పెంచితే మరింత మంది ట్యాక్స్‌పేయర్స్ కొత్త విధానంలోకి వచ్చే వీలుందని నిపుణులూ చెప్తున్నారు. ఇక కిందటి బడ్జెట్‌లో రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంచిన విషయం తెలిసిందే. మరోవైపు పాత పన్ను విధానంలోనూ స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75వేలకు పెంచాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

పన్ను మినహాయింపు

కొత్త ఆదాయ పన్ను విధానంలో ఇప్పుడు వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా ఉంటే ఎలాంటి పన్ను లేదు. అయితే దీన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక పాత ఆదాయ పన్ను విధానంలోనూ ఈ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.2.5 లక్షల నుంచి 3 లక్షలకు పెంచాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఆదాయ పన్ను రిబేటు

ప్రస్తుతం వ్యక్తిగతంగా పన్ను సహిత ఆదాయం ఏటా రూ.7 లక్షలదాకానే ఉంటే పూర్తిగా ట్యాక్స్ రిబేటుకు వీలుంటున్నది. అయితే దీన్ని ఈసారి బడ్జెట్‌లో రూ.10 లక్షలకు పెంచాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుతున్నారు. కొత్త ఆదాయ పన్ను విధానంలో రావాలని కోరుతున్న ఈ మార్పుతో మధ్యతరగతి వర్గాలకు పెద్ద ఊరట లభిస్తుందని చెప్తున్నారు. వినిమయ శక్తి కూడా పెరిగి మార్కెట్‌కు కొత్త ఉత్సాహం వస్తుందనీ నిపుణులు పేర్కొంటున్నారు.

సెక్షన్ 80సీ

కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ ప్రయోజనాలను తేవాలని పలువురు ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. ప్రస్తుతం పాత ఆదాయ పన్ను విధానంలో సెక్షన్ 80సీ కింద ఏటా గరిష్ఠంగా రూ.1.5 లక్షలదాకా పన్ను మినహాయింపులను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చన్న సంగతి విదితమే. ఇదిలావుంటే దీన్ని రూ.2 లక్షలకు పెంచాలని పాత ఆదాయ పన్నును ఎంచుకొంటున్నవారూ డిమాండ్ చేస్తున్నారు.

ఎన్‌పీఎస్‌కు ప్రోత్సాహకాలు

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను మరింత మంది ఎంచుకొనేలా ఈ బడ్జెట్‌లో పలు నిర్ణయాలు, ప్రోత్సాహకాలు ఉండొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి పూర్తిగా పన్ను మినహాయింపును కల్పించవచ్చని, పాత ఆదాయ పన్ను విధానంలో ఉన్నట్టుగానే.. కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ ఎన్‌పీఎస్‌కు రూ.50వేలదాకా అదనపు పన్ను ప్రయోజనాలను కల్పించవచ్చని చెప్తున్నారు.

హెచ్ఆర్ఏ ప్రయోజనాలు

మెట్రోపాలిటన్ ప్రాంతాలకుతోడు ద్వితీయ శ్రేణి నగరాల్లో ఉంటున్నవారికీ హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ) ప్రయోజనాలు అందేలా ఈసారి బడ్జెట్‌లో చర్యలుంటాయని అంచనా. బేసిక్ సాలరీలో 40 శాతానికి బదులుగా 50 శాతానికి హెచ్ఆర్ఏ మినహాయింపుల్ని పెంచవచ్చని చెప్తున్నారు.

సెక్షన్ 80డీ

పెరిగిన ఖర్చుల దృష్ట్యా ఆరోగ్య బీమా ప్రీమియంలూ పెరిగిపోతున్నాయి. సమగ్ర కవరేజీ కోసం మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితి పాలసీదారులకు వచ్చింది. దీంతో కొత్త ఆదాయ పన్ను విధానంలో ఆరోగ్య బీమా కోసం చేసే ప్రీమియం చెల్లింపులపై ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఉండే ప్రయోజనాలను వర్తింపజేయాలని కోరుతున్నారు.

సెక్షన్ 80జీ/80టీటీఏ

స్వచ్ఛంధ సంస్థలకు విరాళాలు పెరిగేలా, బ్యాంకుల్లో పొదుపును ప్రోత్సహించేలా ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80జీ/సెక్షన్ 80టీటీఏ ప్రయోజనాలను కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ అమలుపర్చవచ్చని అంచనా.

గృహ రుణగ్రహీతల కోసం..

నిర్మాణ రంగానికి ఊతమిచ్చేలా స్థిరాస్తి కొనుగోలుదారులకు వివిధ రకాల పన్ను ప్రయోజనాలను బడ్జెట్‌లో ప్రకటిస్తారని అంచనాలున్నాయి. ఇందులో భాగంగానే గృహ రుణగ్రహీతలకు అసలు, వడ్డీ చెల్లింపులపై పన్ను మినహాయింపులను పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏటా రూ.2 లక్షలదాకా పన్ను ప్రయోజనాలను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చు. అయితే దీన్ని రూ.3 లక్షలకు పెంచవచ్చని అంటున్నారు. అలాగే ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల ప్రక్రియను మరింత సులభతరం చేయవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

ప్రస్తుతం దేశంలోని ట్యాక్స్‌పేయర్లలో 78 శాతం కొత్త ఆదాయ పన్ను విధానాన్నే ఎంచుకుంటున్నారు. దీంతో పాత ఆదాయ పన్ను విధానాన్ని కోరుకుంటున్న ఆ మిగతా 22 శాతం మందినీ కొత్త విధానంలోకే తెచ్చేందుకు ఈసారీ పాత విధానంలో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చని, కొత్త దానిలోనే సవరణలు చేస్తారన్న అంచనాలు నిపుణుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో మున్ముందు పాత పన్ను విధానాన్ని పూర్తిగా ఎత్తేసే వీలు కూడా లేకపోలేదన్న అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తుండటం గమనార్హం. కేవలం పాత ఆదాయ పన్ను విధానంలోనే వివిధ సెక్షన్ల కింద రకరకాల ఆదాయ-వ్యయాలకు, పెట్టుబడులు-పొదుపులకు ఇప్పుడు ట్యాక్స్‌పేయర్స్ పన్ను మినహాయింపులను కోరే వెసులుబాటు ఉంటున్న సంగతి విదితమే.



బడ్జెట్ కూర్పులో నిర్మల టీం ఇదే..

వీ అనంత నాగేశ్వరన్: ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి. భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారుగా పనిచేస్తున్నారు.

మనోజ్ గోవిల్: ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి. మధ్యప్రదేశ్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. కేంద్ర వ్యయ కార్యదర్శిగా ఉన్నారు.

అజయ్ సేథ్: ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి. బడ్జెట్ డాక్యుమెంట్లకు తుదిరూపునివ్వడంలో నేర్పరి.

తుహిన్ కాంత పాండే: ఆర్థిక, రెవిన్యూ కార్యదర్శి. ఒడిషా కేడర్ ఐఏఎస్ అధికారి.

అరుణిష్ చావ్లా: ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ కార్యదర్శి. బీహార్ కేడర్ ఐఏఎస్ అధికారి.

ఎం నాగరాజు: త్రిపురకు చెందిన 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆర్థిక సేవల కార్యదర్శిగా ఉన్నారు.

ఫెడ్ వడ్డీరేట్లు యథాతథం

వాషింగ్టన్, జనవరి 30: వరుసగా వడ్డీరేట్లను తగ్గించుకుంటూ వచ్చిన అమెరికా ఫెడరల్ రిజర్వు ఈసారి రేట్లను యథాతథంగా ఉంచింది. ద్రవ్యోల్బణ గణాంకాలు పుంజుకుంటుండటం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలసీల ప్రభావంతో వేచి చూసేధోరణిలో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఈసారి రేట్లను యథాతథంగా ఉంచడానికి మొగ్గుచూపింది. గడిచిన ఏడాదికాలంలో రేట్లను 5.3 శాతం నుంచి 4.3 శాతానికి దించింది.

బీవోబీ లాభం 4,837 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 30: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,837 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,579 కోట్ల లాభంతో పోలిస్తే 5.6 శాతం వృద్ధి కనబరిచినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.34,676 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.31,416 కోట్లతో పోలిస్తే 10 శాతం వరకు పెరిగింది. దీంట్లో వడ్డీల ద్వారానే రూ.30,908 కోట్ల ఆదాయం సమకూరింది. గత త్రైమాసికంలో బ్యాంక్ ఆపరేటింగ్ ప్రాఫిట్ రూ.7,015 కోట్ల నుంచి రూ.7,664 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం ఇచ్చింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 3.08 శాతం నుంచి 2.43 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.7 శాతం నుంచి 0.59 శాతానికి దిగొచ్చింది. అయినప్పటికీ మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ గత త్రైమాసికంలోనూ రూ.1,082 కోట్ల నిధులు వెచ్చించింది.

దొడ్ల డెయిరీ 280 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జనవరి 30: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ దొడ్ల డెయిరీ లిమిటెడ్ అంచనాలకుమించి రాణించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.63.56 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.41.33 కోట్లతో పోలిస్తే 54 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. కంపెనీ ఆదాయం రూ.752.5 కోట్ల నుంచి రూ.912.20 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. వ్యాపార విస్తరణలో భాగంగా రూ.280 కోట్ల పెట్టుబడితో మహారాష్ట్రలో నూతన పాల శీతలీకరణ ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఎండీ దొడ్ల సునీల్ రెడ్డి తెలిపారు. ఈ నిధులను కంపెనీ అంతర్గత వనరుల ద్వారా సేకరిస్తున్నట్లు, అలాగే రోజుకు 17.1 లక్షల లీటర్ల పాలను రైతుల నుంచి సేకరించి ప్రాసెసింగ్ చేస్తున్నట్లు చెప్పారు.

ఇప్పట్లో 'బిల్డ్ నౌ' పోర్టల్ లేనట్టే!

అందుబాటులోకి రాని సాఫ్ట్‌వేర్ • పాత విధానంలోనే 'రియల్' అనుమతులు

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): రియల్ అనుమతులు పొందడం ఇక సులభతరమే అని ఆశలు పెట్టుకున్న వ్యాపారులకు నిరాశే దక్కింది. ప్రభుత్వం ప్రకటించిన బిల్డ్ నౌ పోర్టల్‌కు ఆటంకాలు మొదలయ్యాయి. కొత్త పోర్టల్‌కి సంబంధించిన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రాలేదని తెలిసింది. ఎప్పుడు అందుబాటులోకి వస్తుందన్న అంశంపైనా క్లారిటీ లేకుండా పోయింది. దీంతో వ్యాపారస్తులు పాత విధానంలోనే దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

కనిపించని చిత్తశుద్ధి..

'బిల్డ్ నౌ' పేరిట కొత్త పోర్టల్ విధానాన్ని ఫిబ్రవరి 1నుంచి అమల్లోకి తీసుకువస్తున్నట్టు స్వయంగా మంత్రి శ్రీధర్‌బాబు గత నెల మొదటి వారంలో అధికారికంగా ప్రకటించారు. కానీ ఆ మేరకు చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్టు కనిపించటంలేదు. రియల్ అనుమతుల కోసం జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీ, డీటీసీపీ వంటి విభాగాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఏఐ సహకారంతో బిల్డ్ నౌ పోర్టల్ విధానాన్ని తెరపైకి తెచ్చారు. కానీ, సంస్థల నుంచి అనుమతులు పొందడంతోపాటు అధికారులు ఏ విధంగా దరఖాస్తులు స్వీకరించి, అనుమతులు మంజూరు చేయాలన్న అంశాలపై ఇప్పటికీ శిక్షణ ఇవ్వలేదు.

ఎన్ఎల్‌సీ ప్రాజెక్టులపై కిషన్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) ప్రాజెక్టులపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 2047 నాటికి వికసిత్ భారత్‌గా అభివృద్ధి చేయాలన్న ప్రధాని మోదీ విజన్‌లో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖలో పలు సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఒడిశాలోని తాలాబిరా, మచ్చకట పాత్రపూరాల్లో.. జార్ఖండ్‌లోని సౌత్ పచ్వారా, నార్త్ దాదుల్లో బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఎన్ఎల్‌సీ ద్వారా విశేషమైన కృషి జరుగుతుందన్నారు. ఎన్ఎల్‌సీలో పని చేసే కార్మికులు, ఉద్యోగులకు ప్రమాద బీమా వర్తించేలా పరిశీలించాలని సూచించారు

కేసీఆర్ పాలనే బాగుంది

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతతో మచ్చటిస్తున్న గ్రామస్తులు, వృద్ధులు

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంతతో వృద్ధుల మాటముచ్చట

జగిత్యాల రూరల్, జనవరి 30: కేసీఆర్ పాలనే బాగుండేదని.. మళ్లీ ఆయన సీఎం కావాలంటూ.. అంతర్గాం గ్రామానికి చెందిన పలువురు వృద్ధులు గురువారం జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతతో ముచ్చటించారు. గ్రామ కూడలిలో ప్రజలతో కలిసి చాయ్ తాగుతూ ప్రభుత్వ పాలనపై దావ వసంత అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ పాలనే బాగుండేదని.. ఇప్పుడున్న ప్రభుత్వం మంచిగలేదని వారు స్పష్టం చేశారు.

పీహెచ్‌సీ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

పీహెచ్‌సీలో కుష్టు నివారణ ప్రతిజ్ఞ

వెల్గటూర్, జనవరి 30: ప్రపంచ కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా వెల్గటూర్, అంబారిపేటలో గల పీహెచ్‌సీలలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇక్కడ డాక్టర్లు లవకుమార్, స్వరూప, రీతు రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ జగన్నాథం, మనోరమ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల, జనవరి 30: పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపారు. కథలాపూర్ మండలం చింతకుంటలో ఇటీవల జిల్లా కబడ్డీ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీనియర్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపి నక్షన్, నవనీత్ ఆగస్టు 2న జరిగే ఉమ్మడి కరీంనగర్ జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రేణుక తెలిపారు. ఇక్కడ అకాడమీ ఇన్‌చార్జి అనిల్, ప్రణయ్, సాత్విక, తదితరులు ఉన్నారు.

మ్యూజిక్ సిస్టమ్ అందజేత

కోరుట్ల రూరల్, జనవరి 30: ధర్మారంలోని రామాలయానికి మల్లాపూర్ మండలం సాతారం గ్రామానికి చెందిన జిన్న రాజేందర్-పల్లవి దంపతులు మ్యూజిక్ సిస్టమ్ గురువారం అందజేశారు. ఈ మేరకు ఆలయంలో పూజలు చేశారు. ఇక్కడ ఆలయ కమిటీ సభ్యులు దోడ రంజిత్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, శ్రీను, జగన్‌రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

క్షమాపణ చెప్పాలి

మల్లాపూర్, జనవరి 30: ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, వెంటనే ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని మాల మహానీయుల సంఘం నాయకులు గురువారం నడికుడ గ్రామంలో డిమాండ్ చేశారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడ నేతలు తూర్పు రాజన్న, వినీత్, రాము, రాజేశ్వర్, రాజు, ప్రశాంత్, మోహన్ ఉన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

మేడిపల్లి, జనవరి 30: భీమారం మండలంలో పలువురు బాధితులకు ₹4.75 లక్షల ఎల్‌వోసీ మంజూరైనట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భీమారం మండలం కమ్మరిపేటకు చెందిన ఎన్ లక్ష్మికి ₹2.50లక్షలు, గోవిందారం గ్రామానికి చెందిన పీ వెంకటేశ్‌కు ₹1.75లక్షలు, మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన ఏ నాగేంద్రకి ₹50 వేల ఎల్‌వోసీ మంజూరైనట్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రజాప్రతినిధులు, బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- బాధిత కుటుంబాలకు పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మల్లాపూర్, జనవరి 30: గ్రామాల్లోని బీఆర్ఎస్ కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లోనూ అధైర్యపడొద్దని.. అన్నివిధాలుగా తాను అండగా ఉంటానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల భరోసానిచ్చారు. ఇటీవల మల్లాపూర్ గ్రామసభలో జరిగిన గొడవలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన బండి లింగస్వామి, ముద్దం శరత్, భైరి రవికుమార్, భైరి రాకేశ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు కాగా, బాధిత కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్యే పరామర్శించి, మాట్లాడారు. గ్రామసభ సాక్షిగా జరిగిన గొడవలో అధికార పార్టీ నాయకులు కక్షపూరితంగా బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. పదేండ్ల పాటు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ.. ఏనాడు ఇలాంటి చర్యలకు పాల్పడలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేతలు పెట్టిన అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

గ్రామీణ ప్రాంత యువత అన్ని రంగాల్లో రాణించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సూచించారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని కేవీఎస్ఆర్ మినీస్టేడియంలో జరుగుతున్న ఎంపీఎల్ సీజన్-3 క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ వేంపేట నర్సారెడ్డి, మాజీ చైర్మన్ కాటిపల్లి ఆదిరెడ్డి, నాయకులు దేవ మల్లయ్య, కొమ్ముల జీవన్‌రెడ్డి, మ్యాకల సతీశ్, బండి లింగస్వామి గౌడ్, ముద్దం శరత్, తదితరులు ఉన్నారు.

ఒకరి ఆత్మహత్య

పెగడపల్లి, జనవరి 30: దోమలకుంటకు చెందిన పచ్చిమట్ల మల్లయ్యగౌడ్ (55) గతంలో బొంబాయిలో తెల్లకళ్లు వ్యాపారం నిర్వహించేవాడు. ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. అనారోగ్యానికి తోడు అప్పులు కావడంతో మనస్తాపం చెంది గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లయ్యగౌడ్ భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో రవీందర్ తెలిపారు.

బహుమతుల ప్రదానం

కోరుట్ల, జనవరి 30: పట్టణంలోని సరస్వతి శిశు మందిరం పాఠశాలలో ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గురువారం మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రతినిదులు వెంకటేశ్, చంద్ర మోహన్, శ్రీనివాస్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా ప్రవీణ్

జగిత్యాల రూరల్, జనవరి 30: జగిత్యాల పట్టణ విద్యుత్ శాఖ టౌన్ శ్రీ ఏఈగా ప్రవీణ్ గురువారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా పలువురు విద్యుత్ శాఖకు చెందిన అర్టిజన్ కార్మికులు ఏఈని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఇక్కడ శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌కుమార్, తిరుపతి, శ్రీధర్, మహేందర్, శేఖర్, తదితరులు ఉన్నారు.

సర్వే పరిశీలన

జగిత్యాల రూరల్, జనవరి 30: నర్సింగాపూర్ శివారులోని సర్వే నంబర్ 437లో గల భూమిలో చేపట్టిన సర్వేను జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ గురువారం పరిశీలించారు. ఇక్కడ తహసీల్దార్ శ్రీనివాస్, డీఐవో విఠల్, ఆర్ఐ భూమన్న, శంషొద్దీన్, సర్వేయర్ నవీన్, తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల టౌన్, జనవరి 30: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా ఇంటర్ విద్యాధికారి నారాయణ గురువారం ఆవిష్కరించారు. ఇక్కడ జిల్లా గ్రంథాలయ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ సంపత్‌కుమార్, జనరల్ సెక్రటరీ టీ రమేశ్, ట్రెజరర్ రత్నాకర్, గ్రంథపాలకులు, తదితరులు ఉన్నారు.

ప్రార్థన మందిరాన్ని తొగించాలి

జగిత్యాల రూరల్, జనవరి30: ధర్మారం గ్రామంలోని సర్వే నంబర్ 241లో అక్రమంగా ప్రార్థన మందిరం నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ విశ్వహిందూ పరిషత్ జిలాల అధ్యక్షుడు బోయిన ప్రభాకర్, సహ కార్యదర్శి గాజోజు సతీశ్, హిందూవాహిని రాష్ట్ర సంపర్క ప్రముఖ్ వేముల సంతోష్, రమేశ్, సత్యనారాయణ, గంగాధర్, రాజు, తదితరులు ఉన్నారు.

జీఎస్టీని రద్దు చేయాలి

కోరుట్ల, జనవరి 30: కేంద్రం బీడీ పరిశ్రమపై విధించిన జీఎస్టీని రద్దు చేసి, కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బాలరాజు, సుతారి రాములు డిమాండ్ చేశారు. పట్టణంలోని పద్మశాలీ సంఘం భవనంలో గురువారం రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను నిర్వహించారు. బీడీ కార్మికులకు కనీస ఫించన్ రూ.5వేలు అమలు చేయాలని, ప్రధాన మంత్రి అవాస్ యోజన ద్వారా ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఇక్కడ ఏఐటీయూసీ ప్రతినిధులు విలాస్, సమ్మయ్య, ముక్రం, గోవర్ధన్, రాములు, మౌళానా, విశ్వనాథం ఉన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు

ధర్మపురి, జనవరి 30: ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేసి ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న వారికి జరిమానా విధించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ మహేశ్, వార్డు ఆఫీసర్ వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో

మేడిపల్లి, జనవరి 30: నూతనంగా ఏర్పడిన భీమారం మండల తొలి ఎంపీడీవోగా నీరజ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మేడిపల్లి మండల ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న నీరజ భీమారం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించడంతో మేడిపల్లి ఎంపీడీవో పద్మావతి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అవగాహన సదస్సు

మల్లాపూర్, జనవరి 30: మండల కేంద్రంలోని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలు, సైబర్ నేరాలపై గురువారం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇక్కడ ఉపాధ్యాయులు, అధికారులు ఉన్నారు.

టాపింగ్ టెస్ట్

ఇబ్రహీంపట్నం, జనవరి 30: డ